# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

## ప్రసారణ అనుమతిదారులు మరియు పంపిణీ అనుమతిదారులు చేయు ఇతర వ్యాపారములు నిర్వహా నిబంధన 2005లోని 3వ నిబంధన

(ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజు పత్రము 2వ భాగంలో మే 18.8.2005న ప్రచురించబడినది)

**ఉపోద్ఘాతము:**

ప్రసారణ అనుమతిదారుడు, మండలికి ముందుగా తెలియపరచి, తన ఆస్తులను పూర్తిగా వినియోగించుకొను నిమిత్తము ఇతర వ్యాపారమును నిర్వహించుటకు కేంద్ర విద్యుత్ చట్టము 2003లోని 41వ పరిచ్ఛేదము (సెక్షను) అనుమతిస్తున్నది. అయితే ఈ ఈఅనుమతి అట్టి వ్యాపారములో వచ్చిన ఆదాయములో దామాషా ప్రకారం, సంబంధిత మండలి నిర్ణీతపరచిన విధంగా, అనుమతదారుని యొక్క ప్రసారణ మరియు వీలింగు చార్జీలను తగ్గించుల కొరకు వినియోగించవలెనను షరతుకు లోబడి ఉంటుంది. అదే విధంగా, పంపిణీ అనుమతిదారుడు, మండలికి ముందుగా తెలియపరచి, తన ఆస్తులను పూర్తిగా వినియోగించుకొను నిమిత్తము ఇతర వ్యాపారమును నిర్వహించుటకు చట్టము యొక్క 51వ పరిచ్ఛేదము అనుమతిస్తున్నది. అయితే, ఈ అనుమతి, అట్టి వ్యాపారములో వచ్చిన ఆదాయములో దామాషా ప్రకారం, మండలి నిర్ణిత పరచిన విధంగా, అనుమతిదారుని యొక్క వీలింగు చార్జీలను తగ్గించుట కొరకు వినియోగించవలెనను షరతకు లోబడి ఉంటుంది.

మండలి, ఈ విషయాలపై ఒక ముసాయిదా నిబంధనను తయారుచేసి, దానిని 10.9.2004న ఆంధ్రప్రదేశ్ రాజపత్రములో ప్రచురించి, పత్రికా ప్రకటనను విడుదలచేసి మరియు మండలి వెబ్ సైటులో ఉంచుట ద్వారా ఆసక్తి గల వ్యక్తుల నుండి సలహాలను / సూచనలనూ కోరడైనది. కేవలము, ఏ.పి. ట్రాన్స్ కో మరియు ఏ.పి.సి.పి.డి.సి.ఎల్. అనే రెండు సంస్థలు మాత్రము ముసాయిదా నిబంధనపై తమ సూచనలనూ / సలహాలనూ తెలియజేయడమైనది. మండలి, వారి సలహాలనూ / సూచనలనూ పరిగణన లోనికి తీసుకొని ఈ నిబంధనను ఖరారు చేయడమైనది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003లోని 36వ చట్టము) యొక్క 41వ, 51వ మరియు 181వ పరిచ్ఛేదముల ద్వారా లభించిన అధికారములను మరియు ఈ విషయంలో వీలు కలిగించే అన్ని ఇతర అధికారములను వినియోగిస్తూ, ప్రసారణ అనుమతిదారుల మరియు పంపిణీ అనుమతిదారుల యొక్క ఇతర వ్యాపారముల కొరకు, ఇతర వ్యాపారముల నుండి వచ్చిన ఆదాయంలో అనుమతిపొందిన వ్యాపారమునకు వినియోగించబడు దామాషా కొరకు మరియు దీనికి ఆనుషంగికమైన మరియు అనుబంధమైన విషయముల కొరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ క్రింది నిబంధనను జారీచేయడమైనది:-

**1. సంగ్రహ నామము, వర్తింపు మరియు ప్రారంభము:**

1 ఈ నిబంధనను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ప్రసారణ అనుమతిదారుల మరియు పంపిణీ అనుమతిదారుల ఇతర వ్యాపారముల నిర్వహణ నిబంధన, 2005 అని పిలువవచ్చును.

(2) ఈ నిబంధనను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ప్రసారణ అనుమతిదారుల మరియు పంపిణీ అనుమతిదారుల ఇతర వ్యాపారముల నిర్వహణ నిబంంధన, 2005 అని పిలువవచ్చును.

2 ఈ నిబంధన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని ప్రసారణ అనుమతిదారులుఉ మరియు పంపిణీ అనుమతిదారులందరికీ వర్తించును.

**2. నిర్వచనములు, అర్థాన్వయము:**

ఈ నిబంధనలో సందర్భమును బట్టి వేరే అర్థము ఉన్ననే తప్ప,

(ఏ) "చట్టము" అనగా కేంద్ర విద్యుత్ చట్టము, 2003 అని అర్థము;

(బి) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము;

(సి) "అనుమతి" అనగా రాష్ట్రము లోపల విద్యుత్ ప్రసారణను లేక పంపిణీని చేపట్టుటకు చట్టము యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద మంజూరైన అనుమతి అని అర్థము;

(డి) "అనుమతి పొందిన వ్యాపారము" అనగా మంజూరైన అనుమతి ప్రకారముగా లేక చట్ట ప్రకారం భావించబడే అనుమతిదారునిగా చేపట్టవలసిన అనుమతిదారుని కార్యకలాపములు మరియు నిర్వహణ అని అర్థము;

(ఇ) "అనుమతిదారుడు" అనగా రాష్ట్రంలోపల విద్యుత్ ప్రసారణను లేక పంపిణీని చేపట్టుటకు చట్టము యొక్క 14వ పరిచ్ఛేదము ప్రకారం అనుమతి మంజూరైన వ్యక్తి అని అర్థము. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లోపల ప్రసారణ లేక పంపిణీ చేస్తున్నట్లు భావించబడే అనుమతిదారుడు కూడా చేరియుండును.

(ఎఫ్) "ఇతర వ్యాపారము" అనగా అనుమతిపొందిన వ్యాపారము కాకుండా అనుమతిదారుడు చేయు ఇతర వ్యాపారములు అని అర్థము;

(జి) "రాష్ట్రము" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అని అర్థము.

**3. ఇతర వ్యాపారము గురించి తెలియపరచుట:**

(1) అనుమతిదారుడు తన ఆస్తుల పూర్తి వినియోగము కొరకు ఏదేని ఇతర వ్యాపారమును నిర్వహించుచున్న సందర్భంలో, అట్టి వ్యాపారమును గురించి

తదితర విషయములతో పాటుగా అతడు ఈ క్రింది వివరములను మండలికి వ్రాతపూర్వకముగా ముందుగా తెలియజేయవలెను:

(ఏ) ఇతర వ్యాపారము యొక్క స్వభావము;

(బి) ఇతర వ్యాపారము కొరకు ప్రతిపాదించబడిన మూలధన పెట్టుబడి;

(సి) అనుమతిపొందిన వ్యాపారమునకు చెందిన ఆస్తులు మరియు సౌకర్యములను ఇతర వ్యాపారములో వినియోగించుటవలన దాని ప్రభావము;

(డి) అనుమతిపొందిన వ్యాపారంపైన మరియు అనుమతి పొందిన వ్యాపారం యొక్క కర్తవ్యములు మరియు బాధ్యతలను నిర్వర్తించుటలో అనుమతిదారుని సామర్థ్యము పైన ప్రతికూలమైన ప్రభావము ఉండదని తెలుపుతూ అనుమతిపొందిన వ్యాపారము మరియు ఇతర వ్యాపారము యొక్క ఆస్తులను, సౌకర్యములను వినియోగించవలసిన రీతి;

(ఇ) ఖండము 5 (3) లో తెలిపినట్లుగా ఇతర వ్యాపారములో వచ్చిన ఆదాయమును అనుమతి పొందిన వ్యాపారముతో పంచుకొనే ప్రతిపాదన. ఇతర వ్యాపారం యొక్క వ్యాపార ప్రణాళిక ఆధారంగా ప్రతిపాదిత పంపకమును లెక్కించుటకు ఉపయోగించిన పద్ధతి (తదుపరి అయిదు సంవత్సరములలో ఆశిస్తున్న వార్షిక ఆదాయముతో సహా) ఈ ప్రతిపాదనలో చేరియుండవలెను.

అయితే, ప్రసారణ అనుమతిదారుడు విద్యుత్ వ్యాపారమును చేయరాదు.

(2) అనుమతిపొందిన వ్యాపారానికి చెందిన ఆస్తులను, సౌకర్యములను ఇతర వ్యాపారంలో ఉపయోటించుట మూలంగా, అనుమతి పొందిన వ్యాపారంలోని బాధ్యతలను నిర్వర్తించుటలోగాని లేక అనుమతిదారుని సేవా నాణ్యతలో గాని ఏవిధంగానూ ప్రభావం ఉండకుండా చూసే పూర్తి బాధ్యతను అనుమతిదారుడు తీసుకొనవలెను. ఆ విధంగా ఉపయోగించుట వలన కలిగే నష్టానికి పూర్తి బాధ్యత అంతా అనుమతిదారునిదై యుండును.

(3) వ్రాతపూర్వకంగా ముందుగా మండలికి తెలియపరచని యెడల జరిమానా చెల్లించవలసియుండును. ఈ జరిమానా ఇతర వ్యాపారంలో వచ్చిన పూర్తి వార్షిక ఆదాయము మేరకు కూడా ఉండవచ్చును.

4. **అక్కౌంట్లు:**

(1) అనుమతిదారుడు ప్రతి ఇతర వ్యాపారమునకు సంబంధించి, ...

(ఏ) ఆదాయ మొత్తము, ఖర్చులు, ఆస్తులు, నిల్వలు, లేక ఇతర వ్యాపారము నుండి లేక వ్యాపారమునకు చార్జి చేసిన ఏర్పాట్లు వంటి అక్కౌంటు రికార్డులను వేరువేరుగా నిర్వహించవలెను;

(బి) అట్టి రికార్డుల నుండి, లాభ నష్టాల అక్కౌంటు, బ్యాలన్సు షీటు మరియు నిధుల వనరులు మరియు వాటి వర్తింపుతో కూడిన అక్కౌంటు వివరణలను ప్రతి సంవత్సరమునకు తయారుచేయవలెను.

(సి) తయారు చేసిన అక్కౌంటు వివరణలకు సంబంధించి ప్రతి సంవత్సరానికీ అవి తగువిధంగా తయారుచేయబడినట్లుగా ఆడిటర్సు నివేదికను ఏర్పాటుచేయవలెను మరియు ఆ వివరణలకు సంబంధించిన వ్యాపారం గురించి తెలిపే ఆదాయం, ఖర్చులు, అప్పులు, నిల్వలు మరియు ఏర్పాట్లు అన్ని సముచితమైన అభిప్రాయమును కలిగించవలెను.

(డి) ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అక్కౌంటు వివరణలు మరియు ఆడిటు నివేదికలు ఆ ఆర్థిక సంవత్సరం ముగిసిన ఆరు నెలల లోపు సమర్పించవలెను; మరియు

(ఇ) మండలి, ఆయా సమయములయందు కోరే అదనపు సమాచారమును మండలికి సమర్పించవలెను.

2) ఓవర హెడ్ ఖర్చులు మరియు ఉమ్మడి ఖర్చులలో సముచిత వాటా ఇతర వ్యాపారంనుండి భరిస్తున్నట్లుగా అనుమతిదారుడు మండలి సంతృప్తి మేరకు చూపవలెను.

(3) మండలి నుండి అధికారము పొందిన వ్యక్తి, అనుమతిదారుని అక్కౌంట్లను తనిఖీ చేయుటకు, సరిచూచుటకు హక్కు కలిగి యుండును. అనుమతిదారుడు అట్టి వ్యక్తికి అవసరమైన సహాయమును అందించవలెను.

5. **ఆర్థిక పరమైన చిక్కులు:**

(1) అనుమతిపొందిన వ్యాపారానికి చెందిన ఆస్తులను, సౌకర్యములను అనుమతిదారు ఏవిధంగానూ వినియోగించరాదు లేక అనుమతిపొందిన వ్యాపారం ఇతర వ్యాపారానికి ఆర్థికంగా సహాయపడే విధంగా ప్రత్యేక్షంగా గాని, పరోక్షంగా గాని ఇతర వ్యాపారమును చేపట్టుటకు అనుమతించరాదు.

(2) అనుమతిదారుడు, ఇతర వ్యాపారం మూలంగా లేక అనుమతి పొందిన వ్యాపారం కాకుండా ఇతర కార్యకలాపాల మూలంగా, అనుమతి పొందిన

వ్యాపారానికి చెందిన ఆస్తులు మరియు సౌకర్యములకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఏ విధంగానూ ఆటంకం కలిగించరాదు.

(3) ఇతర వ్యాపారములో వచ్చిన ఆదాయములో సముచితమైన దామాషాలో కొంత మొత్తమును అనుమతిపొందిన వ్యాపారమునకు చెల్లించవలెను. ఈ మొత్తము, అనుమతిపొందిన వ్యాపారమునకు చెందిన ఆస్తులు మరియు సౌకర్యములను ఇతర వ్యాపారములో ఉపయోగించిన / ఉపయోగించబడుచున్నప్పుడు వాటికి చెల్లించదగిన ఖర్చులు లేక మార్కెటు విలువను ప్రతిబింబించే కనీస మొత్తముగా ఉండవలెను.

(4) అనుమతిదారుడు, తన ఆస్తులను, సౌకర్యములను ఇతర వ్యాపారము కొరకు ఉపయోగించే తన ఉద్దేశ్యమును మండలికి తెలియజేసినప్పుడు, ఆయా సందర్భమును బట్టి, మండలి, ఇతర వ్యాపారములో వచ్చే ఆదాయములో అనుమతి పొందిన వ్యాపారమునకు చెల్లించవలసిన సముచితమైన వాటాను మరియు కనీస మొత్తమును నిర్ధారించవలెను. ఇతర వ్యాపారము నుండి చెల్లించవలసిన మొత్తమును నిర్ణయించుటలో మండలి అనుమతిదారుని యొక్క విన్నపములను పరిగణనలోనికి తీసుకొనవలెను కాని తాము సముచితమని భావించునట్టి ప్రత్యామ్నాయ మార్గమును లేక పద్ధతిని ఉపయోగించవచ్చును:

అయితే, ఆయా సందర్భమును బట్టి కాకుండా, తాము సముచితమని భావించినయెడల, మండలి ఇతర వ్యాపారముల తరగతి మొత్తమునకు సంబంధించి అనుమతి పొందిన వ్యాపారమునకు చెల్లించవలసిన సముచిత వాటా, మొదలైన వాటిని నిర్ధారించవచ్చును.

6. **మండలి అధికారములు:**

1) మండలి, ఎప్పుడైననూ,

(ఏ) ఖండము 5లో నిర్దేశించినట్లుగా ఖర్చులు, వ్యయములు సముచితమైన రీతిలో సర్దుబాటు చేయబడుతున్నవా; చెల్లించబడుతున్నవా? మరియు

(బి) మొత్తము టర్నోవరును మరియు అనుమతిపొందిన వ్యాపారమునకు చెల్లించవలసిన మొత్తములను నిర్ధారించుటకు ఇతర వ్యాపారము యొక్క ఆదాయములు తగిన విధంగా లెక్కించబడుతున్నవా? అన్న ఇతర విషయములతోపాటుగా ఈ నిబంధన అమలు గురించి తెలుసుకొను నిమిత్తము, అనుమతిపొందిన వ్యాపారమునకు చెందిన

ఆస్తులను, సౌకర్యములను అనుమతిదారుడు ఇతర వ్యాపారము కొరకు ఉపయోగించుటపై దర్యాప్తు చేయుటకొరకు ఆదేశించవచ్చును.

(2) ఉపఖండము (1) క్రింద దర్యాప్తును నిర్వహించి మండలికి నివేదికను సమర్పించుటకుగాను, మండలి యొక్క ఎవరేని అధికారికి లేక ఎవరేని వృత్తి పరమైన వ్యక్తి లేక నిపుణుడు లేక కన్సల్టెంటుకు గాని మండలి తగిన అధికారమీయవచ్చును.

7. **ఉత్తరువులు మరియు ఆచరణీయ ఆదేశములను జారీచేయుట:**

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 లోని నిబంధనలకు మరియు ఈ నిబంధనకు లోబడి, ఈ నిబంధన అమలు మరియు అనుసరించవలసిన కార్యవిధానమునకు సంబంధించి, ఈ నిబంధన ద్వారా నిర్దేశించుటకు లేక ఆదేశించుటకు మండలికి అధికామీయబడిన అన్ని విషయాలపైన మరియు వాటికి ఆనుషంగికమైన లేక అనుబంధమైన విషయాలపైన, ఆయా సమయములయందు మండలి, ఉత్తరువులను లేక ఆచరణీయ ఆదేశములను జారీచేయవలచ్చును.

8. **సవరణ చేయుటకు అధికారము:**

మండలి, ఎప్పుడైనను ఈ నిబంధనను తగువిధముగా సవరించవచ్చును.

(మండలి ఉత్తరువు మేరకు జారీచేయబడినది)

**ఎస్. సూర్యప్రకాశరావు**
కార్యదర్శి

గమనిక: నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజా సౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదము మాత్రమే. అధికారిక పాఠం కాదు.